
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు జిల్లా వార్తలు 5

సోమవారం 7 జూలై 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్లగడ్డ, బనగానపల్లె	- 9985411377

ఫీజుల దోపిడీ..!



- జిల్లాలో 161 ప్రైవేటు, కార్పొరేట్ ఇంటర్ కళాశాలలు.
- అనధికారికంగా హాస్టళ్ల నిర్వహణ
- ఇరుకైన గదులు, వసతులు లేక ఇబ్బందులు
- పట్టించుకోని ఇంటర్ బోర్డు అధికారులు

ఇంటర్మీడియట్ ప్రైవేటు కళాశాలల్లో యాజమాన్యాల దోపిడీకి అధికారులు గేట్లు ఎత్తేశారు. కళాశాల హాస్టళ్లకు అనుమతులు లేకపోయినా కోట్లాది రూపాయల దోపిడీకి అవి చిరునామాగా మారాయనే విమర్శలు వస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 161 ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో హాస్టళ్ల నిర్వహణకు సంబంధించి అనుమతులు లేవు. కాలేజీ, హాస్టల్ ఫీజులతో కలిపి ఏడాదికి ఒక్కో విద్యార్థి నుంచి రూ. 80వేలు నుంచి రూ. 2 లక్షల వరకు యాజమాన్యాలు వసూళ్లు చేస్తున్నాయి. అయితే ఇంటర్ బోర్డుకు మాత్రం ఎలాంటి ఫీజులు చెల్లించకుండా అధికారులతో మాట్లాడుకొని సరిపుచ్చుతున్నారు.

-కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి)

కోర్సుల పేర్లు చెప్పి..

జిల్లాలోని ఇంటర్ కళాశాలలో సీట్లు వ్యాపారం జోరుగా సాగుతుంది. కళాశాలల్లో గ్రూపులను బట్టి భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలో స్పార్క్, ఎన్-20, ఏసీ, ఐఐటీ, నీట్, జేఈఈ వంటి కోర్సుల పేర్లు చెప్పి భారీ మొత్తంలో ఫీజులు గుంజుతున్నారు. ఈ కళాశాల హాస్టళ్లకు అనుమతులు లేవు. హాస్టళ్లను నడుపుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో లక్షలాది రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. హాస్టల్ ఫీజు కాకుండా ప్రాక్టికల్, ల్యాబ్స్, లైబ్రరీ ఫీజులు అంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు గుంజుతున్నా పట్టించుకునే వారే లేరు.

సౌకర్యాలు అంతంత మాత్రమే

కళాశాల హాస్టళ్లలో సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. ఇరుకైన గాలి, వెలుతురు లేని గదుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఉంచుతున్నారు. 100 మంది సామర్థ్యం గల భవనంలో 500 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. సరిపడు స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండవు. విద్యార్థులు తమ అవసరాలను తీర్చుకునేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి.

నిబంధనలకు తూట్లు

ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం కళాశాలకు ఆట, వాహనాల పార్కింగ్ స్థలాలు, అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ ఉండాలి. బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్డి, స్నానపు గదులు ఉండాలి. ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలు ఉండాలి. వీటితో పాటు సైన్స్ విభాగానికి సంబంధించి రెండు వేల చదరపు అడుగులు, ఆర్ట్స్ విభాగానికి సంబంధించి 1200 చదరపు గదులు ఆటస్థలం ఉండాలి. ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. మామూళ్ల మత్తుకు అలవాటు పడిన అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి అంతా ఒకే అంటూ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు అనుమతులు ఇస్తున్నారు.



హాస్టళ్లను మూసివేయాలి



జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలో అనుమతులు లేని హాస్టళ్లను మూసివేయాలి. సౌకర్యాలు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఇంటర్ బోర్డు అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

● నాగరాజు,
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

హాస్టళ్లు చాలా అధ్వానం



ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల హాస్టళ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడు స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. గాలి వెలుతురు కూడా ఉండదు. విద్యార్థులు చీకట్లో మగ్గుతున్నా యాజమాన్యాలకు పట్టడం లేదు.

● అబ్దుల్లా,
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు..



ప్రైవేట్ జూనియర్ కళాశాల వసతిగృహాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఇవ్వడం లేదు. గతంలో 2014 సంవత్సరం కంటే ముందు ఉండేది. ప్రస్తుతం మున్సిపాలిటీ లేదా నగరపాలక సంస్థ నుంచి కళాశాలల యజమాన్యాలు అనుమతి పొందుతున్నాయి. ఈ విషయాన్ని కర్నూలు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. తాము భవనానికి మాత్రమే అనుమతి ఇస్తామని ఆయన చెప్పారు. హాస్టల్ నిర్వహణకు ఎవరు అనుమతి ఇస్తారో స్పష్టత కొరవడింది.

● సురేష్ బాబు,
డీఐఈవో, కర్నూలు జిల్లా

నేటి నుంచి పీజీ, బీటెక్ పరీక్షలు

కర్నూలు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో పీజీ 4వ సెమిస్టర్, బీటెక్ 3, 4, 5, 6, 7 సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. పరీక్షల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఉపకులపతి వి. వెంకటబసవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ పరీక్షలు ఈనెల 7 నుంచి 28 వరకు జరగనున్నాయని, 452 మంది రెగ్యులర్, 44 మంది సప్లిమెంటరీకి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. బీటెక్ పరీక్షలు ఈనెల 7 నుంచి 31 వరకు జరగనున్నాయని, 360 మంది రెగ్యులర్, 325 మంది సప్లిమెంటరీ రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

మెగా 'పీటీఎం'ను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జూలై 10వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం(పీటీఎం) ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మెగా పీటీఎం 2.0కి సంబంధించి నియోజకవర్గ, మండల స్పెషల్ అధికారులతో, ఎంపీడీవోలతో, మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇతర ప్రజాప్రతినిధులను, పూర్వ విద్యార్థులను ఆహ్వానించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తల్లి పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని 2.0ను పర్యవేక్షణ చేసేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు సంబంధించిన హెల్త్ స్క్రీనింగ్ త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. తల్లికి వందనం పథకం మిస్ అయి ఉంటే.. పాఠశాల వారిగా ఏ కారణం చేత తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరలేదనే లిస్టు తయారు చేయాలన్నారు. వీటిని స్వయంగా ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు పత్తికొండ ఆర్డీవోల స్క్రూటినీ చేయాలన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలు ఒక టీంగా ఏర్పడి ఈ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. జేసీ డా.బి.నవ్య, ఏఎస్పీ హుశేన్‌పీరా, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి భారీ వరద

- ఇప్పటి నీటి లభ్యత 184.2774 టీఎంసీలు
- 879.30 అడుగులకు చేరిన నీటి మట్టం
- మంగళ, బుధవారాల్లో గేట్ల ఎత్తివేత?
- అనుమతి కోసం అధికారుల ఎదురుచూపులు



శ్రీశైలం జలాశయంలోకి చేరిన వరద జలాలు

నంద్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద భారీగా వచ్చిచేరుతోంది. ఎగువ ఉన్న తుంగభద్ర, ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, జూరాల జలాశయాల గేట్లు ఇప్పటికే ఎత్తారు. దీంతో దిగువన శ్రీశైలం జలాశయానికి పెద్దఎత్తున వరద కొనసాగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 1,09,216 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,218 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో నీటి లభ్యత 184.2774 టీఎంసీలు ఉండగా నీటి మట్టం 879.30 అడుగులకు చేరింది. వీటితో పాటు విద్యుత్ ఉత్పాదన కింద జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 67,019క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

తుంగభద్రలో 100 టీఎంసీలు..

ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలకు వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువకు వదిలి పెడుతున్నారు. తుంగభద్రలో 100 టీఎంసీలు కెపాసిటీ ఉండగా.. సుమారు 80శాతం నిండింది. జలాశయం నుంచి 55 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 80 వేల క్యూసెక్కుల మేర వరద శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. దీంతో కుడి, ఎడమ జల ఉత్పాదన కేంద్రాలను పూర్తిస్థాయిలో నడుపుతున్నారు. వీటి ద్వారా 67 వేలు క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు చేరుతోంది.

ఉత్కంఠ...

215 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలం జలాశయంలో ఇప్పటికే సుమారు 185 టీఎంసీలు ఉండటంతో ఉత్కంఠ రేపుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీశైలం జలాశయం ఫుల్ అన్నట్లైంది. ఈనేపథ్యంలో మంగళ, బుధవారాల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఆశాఖవర్గాల నుంచి తెలిసింది. అధికారులు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించారని సమాచారం. ఏది ఏమైనా శ్రీశైలం జలాశయం నీరు ఎప్పుడు విడుదల చేస్తారో..? అని అందర్నిల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇదే క్రమంలో రైతుల్లో ఆసక్తి నెలకుంది. ఇదిలా ఉండగా.. రేపు నంద్యాల కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సలహా మండలి (డీడీఆర్‌సీ) సమావేశం ఉంది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌తో మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అదే రోజు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉందని తెలిసింది. ఈ క్రమంలో రిటైర్డు చీఫ్ ఇంజనీర్ కన్నయ్యానాయుడు కూడా జలాశయాన్ని పరిశీలనకు వచ్చారని సమాచారం.

అధికారులు అందుబాటులో ఉండాలని..

శ్రీశైలం జలాశయం గేట్లను అతి త్వరలోనే ఎత్తి నీటిని విడుదల చేయాలని ఆ శాఖాధికారులు అంచనాకు వచ్చినట్లు సమాచారం. భారీగా వరద వచ్చి చేరడంతో.. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటోంది. ఏక్షణంలోనైనా జలాశయం గేట్లు తెరిచే అవకాశం ఉందని, జలాశయం అధికారులందరూ అందుబాటులోని ఉండాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఆశాఖ అధికారులు గేట్లు ఎత్తడానికి అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించారు. ఈక్రమంలో అధికారులు కూడా అనుమతి కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం. ఏది ఏమైనా మరో రెండు రోజుల్లో శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుంది.

వైభవంగా ఏకాదశి

కర్నూలు కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైందవ భక్తులకు ఎంతో ఆరాధ్యదైవమైన విష్ణు భగవానుడిని పూజిస్తూ ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. జిల్లాలో వైష్ణవ ఆలయాలతో పాటు, వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు, సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.



కర్నూలు గీతా మందిరంలో సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు



కర్నూలు వాసవీనగర్‌లో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

ప్రేమ జంట ఆత్మహత్య 7

శ్రీశైలం, మహానంది క్షేత్రాల్లో భక్తుల రద్దీ



శ్రీశైల క్షేత్రంలో దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

నంద్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం తొలి ఏకాదశి కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చారు. దీంతో శ్రీశైల మహాక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లు దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఇదే క్రమంలో కంపార్ట్‌మెంట్లలో సైతం భక్తులు రద్దీ విపరీతంగా ఉంది. దీంతో దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. వీఐపీ, బ్రేక్ టికెట్లకు చెందిన భక్తులను సైతం దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు మూడు విడతలుగా అనుమతి కల్పించారు.

మహానంది: మహానంది క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేలాదిమంది భక్తులు వీకెండ్‌ను పురస్కరించుకొని శనివారం రాత్రే క్షేత్రానికి చేరుకున్నారు. వేకువజాముననే పుణ్యస్నానాల కోసం క్యూకట్టారు. ప్రధాన ఆలయాల్లోని మహానందీశ్వరున్ని, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. నవనంది క్షేత్రాలైన వినాయకనంది, గరుడ నందీశ్వరుని ఆలయాలతో పాటు భారీ నంది విగ్రహానికి పూజలు చేసారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఏఈవో మధు తెలిపారు.

ఖాదీనం

- ఖాదీ పరిశ్రమల బోర్డుకు కార్యాలయం కరువు
- కనుమరుగవుతున్న కొలువులు
- అరకొర జీతాలతో సిబ్బంది అవస్థలు
- అటకెక్కిన పీఎంఈజీపీ పథకం



కర్నూలు జిల్లా ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు కార్యాలయం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గుండెకాయ లాంటి ఖాదీ బోర్డు దీనావస్థకు చేరుకుంది. నాడు ఓ వెలుగు వెలిగిన జిల్లా ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు ప్రస్తుతం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరత, అరకొర జీతాలు, అర్థాంతరంగా ఆగిన పథకాలతో ఖాదీ బోర్డు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అక్కడి ఉత్పత్తు లకు ఆదరణ కల్పించటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించాలి. ఇదే సత్సంకల్పంతో అర్థ శతాబ్దం క్రితం ఖాదీ బోర్డు పురుడు పోసుకుంది. తొలి నాళ్లలో ప్రభుత్వాలు, ఈ శాఖకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి, గ్రామాల్లోని కుల వృత్తులు, హస్తకళలను ప్రోత్సాహించి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో సహకారం అందించారు.

పాలకుల నిర్లక్ష్యం..

కాలక్రమంలో పాలకుల నిర్లక్ష్యం, నిరాదరణ వల్ల పథకాలతో పాటు ఈ శాఖ సైతం నిర్వీర్యం అవుతూ వస్తోంది. ఫలితంగా దీనిని నమ్ముకున్న వందల సంఖ్యలో ఉద్యోగు లతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలలు కనే ఆశావహులు తీవ్ర నిరుత్సాహానికి గురి అవుతున్నారు.

నాడు ఉద్యోగులతో కళకళ...

గతంలో ఈ శాఖ కార్యాలయం పదుల సంఖ్యలో ఉద్యోగులతో కళకళలాడేది. సహాయ సంచాలకులు, పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, దిగువ శ్రేణి సహాయకులు, ఎగువశ్రేణి సహాయకులు, అటెండర్లు ఇలా పలు రకాల స్థానాలతో కార్యాలయం నిండుగా ఉండేది. కొన్నేళ్ల నుంచి కొత్త నియమాకాలు లేవు. ఎవరైన పదవీ విరమణ పొందినా, మరణించినా వాటి స్థానాలను అలాగే ముగించేస్తున్నారు.

మిగతా 7వ పేజీలో



సంప్రదాయబద్ధంగా మొహర్రం



బనగానపల్లెలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

- మాతంతో బనగానపల్లె వీధులు రక్తసిక్తం
- నవాబు వంశీయుల ప్రత్యేక ప్రార్థనలు
- ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలు

బనగానపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అత్యంత సంప్రదాయబద్ధంగా జరిగే మొహర్రం బనగానపల్లెలో ఆదివారం ముగిసింది. వేలాది మంది షియా ముస్లింలు పాల్గొన్నారు. దొరకోటలోని పీర్ల వద్ద నవాబు వంశీయుల వారసులు మీర్ ఫజుల్ అలీఖాన్, వారి కుటుంబసభ్యులు, షియా ముస్లింలు శోకతప్త హృదయాలతో ప్రార్థనలు చేశారు. వారు ఫాతేహాలు నిర్వహించిన అనంతరం మొహర్రం ఊరేగింపు ప్రారంభమైంది. షియా మతస్థులు దొరకోట వద్ద తలపై కత్తితో కోసుకొని అమరులైన ఇమాంహుస్సేన్ వారి కుటుంబ సభ్యులను స్మరించుకుంటూ నల్లదుస్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. షియా ముస్లింలు బ్లేడులు, కత్తులతో ఎదలపై కొట్టుకుంటూ పీర్ల వెంట విషాద గీతాలు పాడుకుంటూ మాతంలో పాల్గొన్నారు. మాతం నిర్వహించడంతో పట్టణంలోని వీధులు రక్తసిక్తమయ్యాయి. పట్టణంలోని ప్రజలతో పాటు వివిధ గ్రామాలనుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఈ విషాద ఉత్సవాలను, మాతంను మిద్దెలు, మేడలపై ఎక్కి తిలకించారు. దొరకోట నుంచి ప్రారంభమైన ఈ మొహర్రం సందర్భంగా పీర్లు ఉత్సవం పట్టణంలోని పోస్టాఫీసు, ఆస్థానం రోడ్డు, సర్కిల్ పోలీస్‌స్టేషన్, పాతబస్టాండు, పొట్టిశ్రీరాములు కూడలి మీదుగా జుర్రేరువాగు వరకు సాగింది. పట్టణంలోని మొత్తం 40 పీర్ల చావిళ్ల నుంచి పీర్లు దొరకోట పీర్ల వెంట రాగా సాయంత్రం జుర్రేరు వాగుకు చేరుకున్నాయి. అక్కడ పీర్లను శుద్ధి చేసి తిరిగి పీర్ల చావిళ్లకు చేర్చారు. ప్రతి పీర్ల పెట్టెల వెంట శోకతప్త హృదయాలతో ప్రార్థనా గీతాలు ఆలపించారు. మొహర్రం సందర్భంగా వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసి వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ రెడ్డి, ఎస్‌ఐలు దుగ్గిరెడ్డి పోలీసు సిబ్బంది, హోంగార్డులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పాల షర్బత్ పంపిణీ

పాతబస్టాండ్ సమీపంలోని గురెడ్డి కాలనీ వద్ద మంత్రి బీసీ బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో మాతంలో పాల్గొన్న ముస్లింలకు పాల షర్బత్ పంపిణీ చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డికి చెందిన ట్యాంకర ద్వారా పట్టణంలో నీటిని చల్లారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వీధులను శుభ్రం చేశారు. సాయంత్రం పీర్లు జుర్రేరు వాగులోకి వెళ్లి అక్కడ పీర్లను పరిశుభ్రం చేసి యథావిధిగా పీర్లచావిడి, లేదా వారి ఇళ్లలో పీర్లను యథాస్థానంలో చేర్చారు.



బనగానపల్లెలో ఎదలపై కత్తులు, బ్లేడ్లతో కొట్టుకుంటూ మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

డోన్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. డోన్ మండలం కంబలపాడు రోడ్డు ప్రాంతంలో ఇమామ్‌బాషా(34) నివాసం ఉంటున్నాడు. స్వగ్రామమైన కొత్తబురుజులో జరుగుతున్న మొహర్రంలో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. వెనుక వైపు నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

- గత నెల ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విజేంద్ర

ఆలూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని గత నెల 29న ఇంట్లోంచి వెళ్లిపోయిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు, ఎస్ఐ తెలిపిన మేరకు.. పట్టణంలోని బాలు పాఠశాలలో హనుమంతప్ప కుమారుడు విజేంద్ర పదో తరగతి చదువుతున్నారు. చదువుకోకుండా క్రికెట్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించారు. దీంతో విజేంద్ర ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తండ్రి హనుమంతప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. అయితే ఆదివారం పొలాల్లో ఉరి వేసుకున్న విషయం తెలుసుకుని తల్లిదండ్రులు బోరున విలపించారు. ఎస్ఐ మహబూబ్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై బాలుడి అత్యాచారయత్నం

ప్రతిఘటించడంతో దాడి.. గాయపడ్డ మహిళ

ఆదోని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ మైనర్ బాలుడు వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింట్లో ఉంటుంది. కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. బంధువులు ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం బస్టాండ్‌లో ఆటో కోసం ఎదురుచూస్తుంది. అదే గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలుడు బైక్‌పై వచ్చాడు. నేను ఆదోనికి వెళ్తున్నానని, బైక్ ఎక్కాలని చెప్పాడు. గ్రామం దా టాక ఆబాలుడు ఆదోని వైపు కాకుండా కొండల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారయత్నం చేయగా ఆమె ప్రతిఘటించింది. కోపోద్రిక్తుడైన బాలుడు పక్కనే ఉన్న కట్టెతో ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. వివాహిత తన బంధువులకు ఫోన్‌ద్వారా సమాచారమిచ్చి ఘటనా స్థలికి పిలిపించింది. మద్యం మత్తులో ఉన్న బాలుడిని గ్రామానికి తీసుకెళ్లి బంధించి పోలీసులకు సమాచారమిచ్చారు. బాలుడిపై అత్యాచార యత్నం, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

- హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక తిరుపతికి చెందిన బాలిక ఆత్మహత్య
- కర్నూలు జిల్లా బనవాసి ఏపీఆర్‌జేసీలో విషాదం



ఆత్మహత్య చేసుకున్న రిషిత

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఏపీఆర్‌జేసీలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న రిషిత (17) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కళాశాల అధికారులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన మస్తానయ్య, మంజుల కుమార్తె రిషితకు మూడో ఫేస్ కౌన్సెలింగ్‌లో ఎమ్మిగనూరు మండలం బనవాసి ఏపీఆర్‌జేసీ (ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి)లో బైపీసీ గ్రూపులో సీటు వచ్చింది. దీంతో వారం రోజుల క్రితం రిషిత తల్లిదండ్రులు బనవాసి కళాశాలలో వదిలివెళ్లారు. అయితే ఇక్కడ ఉండలేనని రోజు తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుండేది. అయితే వారు సర్దిచెబుతూ వచ్చారు. ఆదివారం రిషిత తల్లిదండ్రులు బనవాసిలోని ఏపీఆర్‌జేసీ కళాశాలకు వచ్చి కూతురుతో సాయంత్రం వరకు గడిపారు. మంచి కళాశాలలో సీటు వచ్చిందని, భవిష్యత్తు బాగుంటుందని ఇక్కడే ఉండి చదువుకోవాలని రిషితకు నచ్చజెప్పి 4.30 గంటలకు సొంతూరికి బయలుదేరారు. అయితే ఇక్కడ హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని రిషిత తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్‌లో ఉన్న బాత్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుంది. విద్యార్థిని కనిపించకపోవడంతో కొద్దిసేపు వెతికారు. చివరికి బాత్‌రూంల్లో చూడగా ఓ రూంకు గడి వేసి ఉండటంతో తెరిచేందుకు ప్రయత్నించారు. రాకపోవటంతో మరో బాత్‌రూం ద్వారా వెళ్లి చూడగా రిషిత ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్యలత రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కళాశాలకు చేరుకొని బాలికను వెంటనే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన వెంటనే వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు ఆసుపత్రికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రిషిత ఆత్మహత్యకు పాల్పడం బాధాకరమని అన్నారు. హోం సిక్ వల్లే మానసిక ఆందోళనకు గురైందని తెలుస్తోందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సం బైపీసీలో చేరిన రిషిత వారం రోజుల్లో ఆత్మహత్యకు పాల్పడటం కళాశాలలో తీవ్ర విషాదం నెలకొంది.

ప్రేమ జంట ఆత్మహత్య

- ప్రకాశం జిల్లాలో చెట్టుకు ఉరివేసుకున్న ప్రేమికులు
- నంద్యాల జిల్లా మాధవరంలో విషాదం

ప్యాపిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ఓ ప్రేమ జంట చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన ఆదివారం ప్రకాశం కొమరోలు మండలంలోని అక్కపల్లి గ్రామ శివారు ప్రాంతంలో జరిగింది. మాధవరం గ్రామానికి చెందిన కంబగిరి రాముడు(24), భారతి(22) ఇద్దరూ గ్రామంలో కూలీ పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసింది. ఏడాదిగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. అయితే భారతికి రెండేళ్ల క్రితం మండలంలోని అలేబాదు గ్రామానికి ఓ వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాలతో ఆ యువతి భర్తను వదిలేసి ఏడాదిగా పుట్టింటిలోనే ఉంటోంది. ఈ క్రమంలో భారతి, కంబగిరి రాముడు మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది.

ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయిన ప్రేమికులు

ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఈ నెల 4న ప్రేమికులు ఇంటి నుంచి వెళ్లిపోయారు. ప్రకాశం జిల్లాలోని కొమరోలు మండలంలోని అక్కపల్లి గ్రామ శివారు ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్నారు. అక్కడి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సెల్ ఫోన్ ఆధారంగా ప్రేమికుల అడ్రస్సులు తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



కంబగిరి రాముడు (ఫైల్)



భారతి (ఫైల్)

మాధవరంలో విషాదఛాయలు

యువతి, యువకుడు ఆత్మహత్య చేసుకోవడంతో మాధవరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇంటి నుంచి వెళ్లిపోయిన వారు వివాహం చేసుకొని వస్తారని అనుకున్నామని, అయితే ఇలాంటి నిర్ణయం తీసుకుంటారని అనుకోలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

'హంస'ను బలోపేతం చేద్దాం

- రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్



ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడితో నాయకులు

కర్నూలు హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస)ను బలోపేతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అన్నారు. ఈ మేరకు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యఆరోగ్య శాఖలో గుర్తింపు పొందిన మొదటి యూనియన్ తమదేనని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 141 క్యాడర్ల కోసం నిరంతరం వారి పక్షాన నిలబడుతామన్నారు. అనంతరం జిల్లాకు వచ్చిన హంస రాష్ట్ర అధ్యక్షుడిని కర్నూలు సిటీ అధ్యక్షుడు టి.గోవిందు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఏపీ హంస కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గైర్హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంటు, సంపత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు సత్యనారాయణ శర్మ, లీలమ్మ, పుష్పావతి, హెడ్ నర్సుఉ కే.ఉమ, సుగుణవతమ్మ, జే.నిర్మల, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసులు, కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు, అనంతపురం జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

జీతాలు అందక కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన

కర్నూలు హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూన్ నెల జీతం అందక 600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ప్రతి నెల 1, 2 తేదీల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు అందేవి. అయితే గత నాలుగైదు నెలలుగా కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్‌గా జీతాలు అందడం లేదు. ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులు, పారామెడికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సిబ్బంది 600 మంది వివిధ క్యాడర్లలో పని చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన జీతాల బిల్లును ప్రతి నెల 25వ తేదీలోపు ట్రెజరీకి పంపించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత ఉద్యోగి సరైన సమయంలో బిల్లులు పంపకపోవడం వల్లే జీతాలు ఆలస్యమవుతున్నాయనీ కాంట్రాక్టు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో పని చేసిన పరిపాలన అధికారులు ప్రతి నెల 25వ తేదీలోపు జీతాలు బిల్లులు ట్రెజరీకి పంపించేవారు. కానీ ఈ నెల 3వ తేదీ అయినా కాంట్రాక్టు ఉద్యోగుల హాజరు వివరాలు జీతాల వివరాలు పంపకపోవడంపై కాంట్రాక్టు ఉద్యోగులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రతి నెల 1 లేదా 2వ తేదీన జీతాలు రెగ్యులర్‌గా వచ్చేవని, కానీ ఇటీవల కాలంలో మరింత ఆలస్యం అవుతున్నాయనీ జీతం అందక కుటుంబ పోషణ భారాన్ని కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనున్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీతాలు పంపిణీ చేసినా కర్నూలు జీజీహెచ్‌లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మాకు ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీకి ఫోన్‌లో వివరణ కోరగా.. ఏడీ అందుబాటులోకి రాలేదు.

జీవితంలో సైన్స్ ఒక భాగం కావాలి

- మూఢ నమ్మకాలతో భవిష్యత్తు అంధకారం
- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్

కర్నూలు హాస్పిటల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో సైన్స్ ఒక భాగం కావాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) 16వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సమావేశానికి సురేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మూఢ నమ్మకాలతో భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. తెలంగాణ జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు మురళీధర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడు భద్రతంగా ఉండాలంటే గాంధీ, అంబేడ్కర్ మార్క్స్ భావజాలాలు సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలన్నారు. జేవీవీ వ్యవస్థాపకులు డా.వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో సాగు, తాగునీటి సమస్య ఉందని, సామాజిక భద్రత ఉన్న ప్రతి పౌరుడు నీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. రాయలసీమ నీటి విషయంలో అవగాహన లేకపోతే రాబోయే కాలంలో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి అన్నారు. సీమ ప్రజలు సాగు, తాగునీటిపై అవగాహన పెంచుకోవాలని, ఇప్పటికి పశ్చిమ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. డైట్ ప్రిన్సిపాల్ డా.ఆదినారాయణ రెడ్డి, నాయకులు సమత, డా.అరుణ, మహ్మద్ మియా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాదీనం

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లా పరంగా చూస్తే కర్నూలులో ఇద్దరు, నంద్యాలలో మరో ఇద్దరు ఒప్పంద ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిపైన పర్యవేక్షణకు కర్నూలు జిల్లా ఇన్‌చార్జిగా కడప జిల్లా పరిశ్రమల కేంద్రంలో పనిచేసే క్రిష్ణయ్యను, నంద్యాల జిల్లాకు కర్నూలు చేనేత, జౌళిశాఖకు చెందిన అధికారి నాగరాజారావును బాధ్యుడిగా నియమించారు. ఈ ఇద్దరు ఉన్నతాధికారులు మాతృ సంస్థలోనే బిజీగా ఉండటంతో వారికి, ఇతర జిల్లాల స్థానా లకు బాధ్యులుగా ఇవ్వటం ప్రతికూలాంశంగా మారింది. అందుబాటులో ఉన్న జూనియర్ ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఇద్దరు ఉద్యోగులు కార్యాలయ పనుల నిమిత్తం ఎక్కడికైనా వెళితే, ఆరోజుకు కార్యాలయం ఖాళీ అయినట్లే. ఇంత పెద్ద ప్రభుత్వ శాఖ అయిన నేటికీ ఈ విభాగానికి సొంత భవనం కానీ, కార్యాలయ గది కానీ అందుబాటులో లేవు. జిల్లా పరిశ్రమల కేంద్రంలోనే ఓ మూలాన కార్యాలయాన్ని నిర్వహిస్తుండటం గమనార్హం.

ఓవైపు పనిభారం..

కార్యాలయంలో పనిచేసే ఒప్పంద ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. అసలే ఇద్దరే చిరు ఉద్యోగులు, ఓవైపు పనిభారం. మరో వైపు అరకొర వేతనాలు, చేతికి అందే రూ.16,500 తోనే అన్ని సరిపుచ్చుకోవాలి. కార్యాలయ అవసరాల కోసం చిన్న కాగితం కావాలన్నా సొంత జేబులోంచి ఖర్చు పెట్టాల్సిందే.

పీఎంఈజీపీ ఒక్కటే..

ఖాదీ బోర్డు ద్వారా పీఎంఈజీపీ(ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) ఒక్కటే దీర్ఘకాలంగా అమలులో ఉంది. ఈ పథకం సైతం మూడు నెలలుగా అటకెక్కింది. నిధులలేమితోనే ఈ పథకం అమలును అర్థాంతరంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. పథకం కోసం అవసరార్థులు పెద్ద సంఖ్యలో కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు, దరఖాస్తులు సమర్పిస్తున్నారు. వీరి దరఖాస్తులను సిబ్బంది స్వీకరించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారే తప్ప, వాటిని ముందుకు పంపటం లేదు. దీంతో దరఖాస్తుదారులు అయోమయానికి, ఆందోళనకు గురి అవుతున్నారు. గతంలో మాదిరి లబ్ధిదారులకు రాయితీపై ఎటువంటి హామీ ప్రకటించలేదు. నిధుల లభ్యతను బట్టి మాత్రమే రాయితీని పరిశీలిస్తామని నిబంధనల్లో కొత్త మెలిక పెట్టటం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

అనుమతులు రాగానే ముందుకు పంపిస్తాం

అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. వాటిని ముందుకు తీసుకువెళ్లేందుకు ఇంకా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ముంబైలోని కేవీఐసీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అవి రాగానే తదుపరి ప్రక్రియను కొనసాగిస్తాం. రాయితీపై స్పష్టత లేదు.

-క్రిష్ణయ్య, ఇన్‌చార్జి ఏడీ, కర్నూలు జిల్లా ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు

పాలకవర్గాలు లేని మార్కెట్ కమిటీలు


- పడకేసిన అభివృద్ధి
- లబోదిబోమంటున్న రైతులు



కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్న మార్కెట్ కమిటీల యార్డుల్లో అభివృద్ధి పడకేసింది. ప్రభుత్వం ద్వారా నిధులు తెప్పించి మార్కెట్ యార్డుల్లో వసతులను మెరుగుపరిచేందుకు మార్కెట్ కమిటీల అధికార యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపడం లేదు. మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులు తాము చెసే విజ్ఞప్తుల కంటే పాలకవర్గాల ఒత్తిడికే ఎక్కువ స్పందన ఉంటుందని, నిధుల విడుదల తమ చేతుల్లో లేదని మార్కెట్ కమిటీల అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గత సంవత్సరం 2024-25లో 15 మార్కెట్ కమిటీల ద్వారా దాదాపు రూ.50 కోట్ల ఆదాయం సెస్సు రూపంలో వచ్చింది. అయితే.. పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధుల్లో మార్కెట్ కమిటీల అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం లేకుండా పోయింది. 15 మార్కెట్ కమిటీల్లో ఇప్పటి దాకా కేవలం నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, బనగానపల్లె, పత్తికొండ, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలకు మాత్రమే పాలక వర్గాలు ఉన్నాయి. మిగిలిన 9 మార్కెట్ కమిటీలకు ఇప్పటి దాకా పాలకవర్గాలు ఏర్పాటు కాలేదు. దీంతో మార్కెట్ యార్డుల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. ఇన్‌చార్జిల పాలన కారణంగా కర్నూలు, ఆదోని యార్డుల్లో కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, కమీషన్ ఏజెంట్ల లైసెన్సుల పునరుద్ధరణ, కొత్తవారికి లైసెన్సులు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు పాలక వర్గాలు లేని కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. కర్నూలు మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు అధికారులు గత కొద్ది నెలలుగా మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. జంబో ప్లాట్‌ఫారం నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం వల్ల వర్షం వస్తే రైతులు నిల్వ చేసిన పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి. మరుగుదొడ్లు, టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమీప కాలనీల్లోని డ్రైనేజీ నీళ్లన్ని మార్కెట్ యార్డులో నిల్వ ఉండి కుంటలను తలపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కమిషన్ ఏజెంట్లకు అంగళ్లు లేక రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను తమ షాపుల వద్ద నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. అదే విధంగా కమిషన్ ఏజెంట్లు ఒక్క బిల్డింగులోనే ఇద్దరు, ముగ్గురు ఉండి వ్యాపారాలు చేసుకోవల్సిన పరిస్థితి దాపురించింది. పత్తికొండ, ఆలూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, పాణ్యం, డోన్, తదితర మార్కెట్ యార్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మార్కెట్ కమిటీల ద్వారా చేకూరిన సెస్సు ఆదాయం 40కోట్లకు పైగానే ట్రెజరీలో మూలుగుతోంది. ఈ నిధులు రాబట్టి రైతులకు అవసరమైన మౌలిక వసతులను యార్డుల్లో ఏర్పాటు చేయాలంటే పాలకవర్గాలతోనే సాధ్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

పాలకవర్గాలు త్వరలోనే ఏర్పాటవుతాయి



కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో 2 మార్కెట్ కమిటీలకు మాత్రమే పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా త్వరలోనే పాలకవర్గాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- నారాయణమూర్తి, ఏడీఎం



WANTED TEACHERS
Wanted English, Maths, Science Social teachers to teach 1st to 7th classes and for NURSERY, LKG & UKG. 8328183717.
AJL-229036

MOIN BASHA
5- LINES
NAME CHANGE

MOIN BASHA
5- LINES
NAME CHANGE

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA-237899

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, నగర అధ్యక్షుడు కే.సుధాకరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ముజఫర్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు గౌండాలు, కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, మట్టిపని, కరెంటు, సెంట్రింగ్ తదితర 26 రకాల వృత్తులు చేసుకునే కార్మికులు బిల్డింగ్ రంగంలో పనిచేస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డును సీఎం చంద్రబాబు వెంటనే పునరుద్ధరించాలని కోరారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ 15మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా డి.వెంకటరమణ, అధ్యక్షులు ఎం.మునిస్వామి, కన్వీనర్ ఎం.పి.ఆనంద్, గౌరవాధ్యక్షుడిగా కే.సురేష్, కమిటీ సభ్యులుగా సి.ప్రసాద్, లక్ష్మినారాయణ, మద్దిలేటి, మహ్మద్ గౌస్, వీరన్న, ఆనందం, ఎం.శేఖర్‌లు ఎన్నికయ్యారు. సీపీఎం వార్డు కార్యదర్శి చిన్న ఆనంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వం

కర్నూలు న్యూసిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర విమర్శించారు. ఆదివారం రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిలో 3లక్షల మంది నిరుద్యోగులను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. 17 మందితో ఓల్డ్ సిటీ డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అంజి, మధు, కమిటీ సభ్యులుగా రాజు, జుబేర్, ఇర్ఫాన్, ఖాదర్, నూర్ చంద్ర, గోపి, ఆలి అక్బర్, శంకర్, ఖాదర్, ఖలీల్ ఉన్నారు. కార్యక్రమం లో డీవైఎఫ్ఐ మాజీ నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఓర్వకల్లు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఓర్వకల్లు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. డీవైఎఫ్ఐ మండల నాయకులు మహేష్ అధ్యక్షత వహించారు. నరేష్ మాట్లాడుతూ ఓర్వకల్లు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్ పేరుతో రైతుల నుంచి 30 వేల ఎకరాల భూములను ప్రభుత్వం సేకరించిందన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 25 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11, 12 తేదీల్లో జరిగే డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు శివకుమార్, ప్రసాద్, శేఖర్, హరి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ఓర్వకల్లు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ఆకర్ష్ వైద్య బృందం, పూర్వ విద్యార్థులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గురుకుల పాఠశాలలో చదివిన పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్లు జనార్దన్ రెడ్డి, డా.మల్లికార్జున, మహేష్ రెడ్డి భరత్‌కుమార్ రెడ్డి, లింగేశ్వరరావు, డా.చిన్నన్న, తిరుపతి, కరిష్మా, సర్వేషర్‌గౌడు, అన్నమ్మ, తదితరులు విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్ అల్యూమినీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటనారాయణ, వైస్ ప్రెసిడెంటు రాముడు, ఆకర్ష్ అసోసియేషన్ సెక్రటరీ విజయకుమార్ రెడ్డి, ట్రెజరర్ సాయి నిరంజన్, పూర్వపు విద్యార్థులు గొట్టిపాటి వెంకటేశ్, వేణు పాల్గొన్నారు.

13న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్య స్వామి అన్నారు. ఆదివారం పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో ఈకార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు వివిధ హిందూ ధార్మిక సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన విడుదలచేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి స్వామిజీలు, ధార్మిక ప్రబోధకులు, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ పీ విశేష సంపర్క రాష్ట్ర ప్రముఖ్ టి.ప్రతాపరెడ్డి, వీహెచ్‌పీ ఉమ్మడి జిల్లా ప్రముఖ్ నీలి నరసింహ, వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు రామాంజనేయులు గురుస్వామి, లక్ష్మీరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖరప్ప, సతీష్‌రెడ్డి, మంజునాథ్, చంద్రమోహన్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

జానపద సంగీతం పల్లెసీమల ప్రజల జీవనాడి



టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో సత్కారం పొందిన కళాకారులు

కర్నూలు కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జానపద సంగీతం పల్లెసీమల ప్రజల జీవనాడి అని, శ్రామిక జీవనాన్ని మర్చిపోయేందుకే గ్రామీణుల నోట అనేక జానపద పాటలు బాణీ కట్టాయని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'వారంవారం -సాంస్కృతికం' అనే కార్యక్రమంలో భాగంగా, యూట్యూబ్‌లో తమ జానపద పాటల ద్వారా పేరు తెచ్చుకుంటున్న గాయకులతో 'జానపద సంగీత విభావరి'ని నిర్వహించారు. రాయలసీమ జిల్లాలతో పాటూ తెలంగాణా ప్రాంతానికి చెందిన గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మాజీ ఎంపీ, కళాక్షేత్రం ఛైర్మన్ టీజీ వెంకటేశ్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో ఒక సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగర ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి, ఆహ్లాదంగా వీటిని తిలకించవచ్చని తెలిపారు. కళాక్షేత్రాన్ని వినోదానికి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, లలిత కళాసమితి మాజీ అధ్యక్షుడు పి. దస్తగిరి, నగరపాలక సంస్థ మేనేజర్ బి. చిన్నరాముడు, విశ్రాంత సీఐ సత్యం, కళాక్షేత్రం ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇనాయతుల్లా, మహమ్మద్ మియా వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. జానపద కళాకారులు ఆలూరు రాజా, అఖిల, విష్ణు, నరసింహులు, మహేందర్, వై. గంగాధర్‌ను ఘనంగా సత్కరించి, కళాక్షేత్రం తరపున రూ.35వేలు పారితోషికం అందజేశారు. కళాకారులు ఆలపించిన జానపద పాటలు, జానపద వేషధారణలతో చేసిన నృత్యరూపకాలు అందరిని అలరింపజేశాయి.



చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం: మంత్రి

కర్నూలు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని అశోక్‌నగర్‌లోని 45వ వార్డు 'తొలి అడుగు'లో భాగంగా పర్యటించారు. మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏఏ పథకాలు అందాయని అడిగి తెలుసుకున్నారు. 'తల్లికి వందనం' డబ్బులు తల్లుల అకౌంట్లలోకి జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులమందరం భాగస్వాములై ఇంటింటికి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు చెప్పిన సమస్యలను నోట్ చేసుకుని వెంటనే వీటి పరిష్కారం కోసం తాము అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాణిక్యమ్మ, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

గూడూరు: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం మండలంలోని పొన్నకల్ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జే.సురేష్, గూడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కే.రామాంజనేయులు, టీడీపీ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, సృజన్, జులకల్ సత్యనారాయణరెడ్డి, కాంతరెడ్డి, నాగప్ప యాదవ్, హనుమంతు, చాంద్‌బాషా తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పర్ల గ్రామంలో 'తొలి అడుగు'లో పాల్గొన్న పాణ్యం అబ్జర్వర్ ఆదెన్న

● మండలంలోని పెంచికలపాడు గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట్రాముడు , టీడీపీ నాయకులు ఎంపీటీసీ మద్దిలేటి, కరణం చిన్నగిడ్డయ్య, పత్తి రవి, యుగంధర్, నాగేష్, రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఉయ్యాలవాడ గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌రెడ్డి, మహబూబ్‌బాషా, రామకృష్ణ, బాలకృష్ణ, శ్రీనివాసులు ఉన్నారు.

● మండలంలోని చింతలపల్లె గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బీవీ శేఖర్, పెద్దతాతయ్య, చిన్నతాతయ్య వడ్డె శేఖర్ తదతరులు పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సుపరిపాలన సాకారం అవుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. ఆదివారం 37వ వార్డు వీకర్‌సెక్షన్‌కాలనీలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మతో కలిసి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్ బేగం, పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి.గంగాధర్‌గౌడ్, జనార్ధన్ ఆచారి, ఎస్.రాఘవేంద్ర, నాగేశ్వరరావు, పీజీ.వెంకటేష్, మహమ్మద్‌ఆలీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

● ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం నియోజకవర్గ అబ్జర్వర్ ఆదెన్న తెలిపారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ఆయన ఆదివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఉలిందకొండ సింగిల్ విండో అధ్యక్షుడు ఈవీ.రమణ, ఎంపిటీసీ మేకల శేషన్న, వాకిటి మాదేశ్, దేవలంకాటి శేఖర్, మహనంది, రామగిడ్డయ్య, చిన్నలక్ష్మన్న, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



గూడూరు మండలం పొన్నకల్‌లో పథకాల గురించి వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



ఎన్టీఆర్‌నగర్‌లో 'తొలి అడుగు'లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి



మాట్లాడుతున్న వాల్మీకి సీనియర్ నాయకుడు హనుమంతప్ప

కోడుమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి సీనియర్ నాయకుడు హనుమంతప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రాముల దేవాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వాల్మీకులంతా ఐక్యంగా పోరాటం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు వాల్మీకును ఎస్టీ జాబితాలో చేరుస్తామని రాజకీయ నేతలు ఓట్లు వేయించుకొంటున్నారు. ఎన్నికల అనంతరం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన ఆదోని, గుంతకల్లు వాల్మీకి ఎమ్మెల్యేలు పార్థసారథి, గుమ్మనూరు జయరాంలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి వాల్మీకులకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. 12న వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ మండల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాల్మీకులు గోపాల్‌నాయుడు, బ్రిటీష్ రాముడు, బలరాం, రాముడు, మధు, క్రిష్ణ, అయ్యప్ప, మహేష్, క్రిష్ణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ మరిచిన ప్రభుత్వాలు : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కోడుమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిచాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. కోడుమూరు పట్టణంలో సీపీఐ నియోజకవర్గ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విచ్చనకరమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎక్కడ చూసిన అల్లర్లు పెరిగిపోయాయని చెప్పారు. రాష్ట్రంలో వలసలు పెరిగిపోయాయి. రైతులను పట్టించుకునే వాళ్లు లేరని, నిత్యావసరాల ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల, వేదవతి తదితర ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న లక్ష్మీనరసింహయాదవ్

కల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవనంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఘనంగా జరిగింది. బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మీనరసింహయాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మికుల నంద్యాల జిల్లా అధ్యక్షుడు పటాన్‌అబి ఖాన్, 16 వార్డుల ఇన్‌చార్జ్ రజాక్ వలి, లీగల్ సెల్ అధ్యక్షుడు జీవన్‌బాబు, జిల్లా కార్యదర్శి వెంకటరాముడు, మోషన్‌బేగ్, ఆలీఖాన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: ఓటమి ఎరుగని నాయకుడు జగ్జీవన్ రామ్ అని మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధకృష్ణ, అనంతరత్నం మాదిగ, ఎస్సీ బజారన్న, ఎజాజ్ అహ్మద్, షేక్ ఖాజాహుస్సేన్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

● **టీడీపీ ఆధ్వర్యంలో:** నగరంలోని ఐదురోడ్ల కూడలిలోని జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు, దళిత బహుజన సేవా సమితి నాయకులు కాశేపోగు గిడ్డన్న నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బల్లర్ హుస్సేన్, సందేపోగు కర్ణ, దేవరాజు, నాగరాజు, సత్యమ్మ, దినేష్ పాల్గొన్నారు.

10న విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ ధర్నా

కర్నూలు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 10న విద్యారంగ సమస్యలపై మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మహేంద్రబాబు తెలిపారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీ ముఖ ద్వారం వద్ద విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాకు సంబంధించిన ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సిద్దు, హనీఫ్, ప్రమోద్, జనార్ధన్, సూర్య, సన్నీ, దను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏకలవ్య చిత్రపటానికి టీఎస్ఎఫ్ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామరాజు, కార్యదర్శి వెంకటేశ్, ఎరుకుల సంఘం నాయకులు కరివేపాకు రామకృష్ణ, సాయికిరణ్, ఎరుకుల ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు తిరుపాలు పాల్గొన్నారు.

● ఏకలవ్యుడి జీవితం నేటి యువతరానికి ఆదర్శమని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకుల రాజు అన్నారు. ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వైహెచ్‌పీఎస్ కార్యాలయం నందు ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎరుకుల హరి, గోపి, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎరుకుల కుశల్, హరిశేఖర్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు

కర్నూలు న్యూసిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజల ఇళ్లలో స్మార్ట్ మీటర్లను పెట్టరాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీఎస్.రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం 43వ వార్డు ఇందిరాగాంధీనగర్‌లో స్మార్ట్ మీటర్లపై పోరుబాట కార్యక్రమాన్ని ఇంటింటికి తిరుగుతూ నిర్వహించారు. రాధాక్రిష్ణ మాట్లాడుతూ పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని, అక్రమంగా ఆదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు టి.రాముడు, నాయకులు మద్దిలేటి, శ్రీనివాసులు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును తక్షణమే నిలిపివేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం బృందం ఆధ్వర్యంలో 32వ వార్డు ముజఫర్‌నగర్, 30వ వార్డు షరీన్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.యేసు, మౌలాలి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



వాసవీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



హరిహర క్షేత్రంలో ఏకాదశి పూజలకు హాజరైన భక్తులు

కర్నూలు కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బళ్లారి చౌరస్తా, వై.జంక్షన్ సమీపంలోని వాసవినగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ఆదివారం వేకువ జామునే సుప్రభాత సేవ, క్షీరాభిషేకాలు చేసి, పుష్పాలతో ప్రత్యేక అలకంరణ చేశారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. 108 గోవింద నామాలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులతోపాటూ, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంకల్‌బాగ్‌లో వెలసిన హరిహరక్షేత్రంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు చెరు వు వెంకట దుర్గాప్రసాద్, అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, ఇతర సభ్యులు శ్యామ్‌సుందర్ రావు, సీఎస్ ప్రసాదరావు, శ్రీనివాసరాజు, బి.నాగేశ్వరరావు, రాజేశ్ శర్మ, ఫణి పాల్గొన్నారు. పాతనగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠంలో, బళ్లారి చౌరస్తాలోని ఆంజనేయస్వామి ఆలయంలో, కిడ్స్ వరల్డ్ సమీపంలోని గోసంరక్షణశాలలో, ఇస్కాన్ మందిరంలో జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

అమృతత్వాన్ని కలిగించేదే భగవద్గీత
- శ్రీనివాస రామానుజ దాసు



గీతా ప్రచార ధామంలో ప్రసంగిస్తున్న శ్రీనివాస రామానుజ దాసు

భగవద్గీత పఠించడంతో మృత్యుభయం వీడి అమృతత్వం కలుగుతుందని గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమ ప్రబోధకుడు, హైందవ శ్రేష్ఠ పురస్కార గ్రహీత శ్రీనివాస రామానుజ దాసు ఉద్బోధించారు. ఆదివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఏర్పాటు చేసిన ఏకాదశి పూజలు, సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గీతా ప్రచార ధామం నిర్వాహకుడు, గీతారత్న పురస్కార గ్రహీత డీవీ రమణ మాట్లాడుతూ ప్రతి ఏకాదశికి వచ్చే భక్తులకు గీతా పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా గోమాతకు పూజలు, శ్రీకృష్ణుడి విగ్రహానికి అభిషేకాలు, విశేషాలంకరణలు చేశారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం సభ్యులు ఎస్‌జీ మహాబలేష్, ఇల్లూరి వెంకట రమణ, సింహాద్రి రమేష్, జగన్మోహన్, సంగీత శిక్షకులు నాగమల్లేశ్వరమ్మ, దేవీశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అవసరం

● జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కె. కిషోర్‌కుమార్

కర్నూలు కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణిస్తున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలో సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం లో, నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం చేశారు. కిషోర్‌కుమార్ మాట్లాడు తూ కొన్నేళ్లుగా నగర బ్రాహ్మణ సంఘం వారు పేదవర్గాలకు చెందిన బ్రాహ్మణుల పురోభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని చెప్పారు. కిషోర్‌కుమార్ రూ.5వేలు, విశ్రాంత ఎంఈవో రంగనాథశర్మ రూ.10వేలు చెక్కు అందజేశారు. అఖిల భారత కరివేన నిత్యాన్నసత్రం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, సంఘం గౌరవాధ్యక్షుడు సీవీ దుర్గాప్రసాద్, కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడు కె. శ్యామ్‌సుందర్ రావు, కోశాధికారి సీసీ ప్రసాదరావు, ఉపకార్యదర్శి నాగులవరం రాజశేఖర్‌రావు, సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, ఇతర ప్రతినిధులు శ్రీనివాసరాజు, బి. నాగేశ్వరరావు, మామిళ్లపల్లి రాజేశ్ శర్మ, ఫణి పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న కిషోర్‌కుమార్ తదితరులు

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం



గోకులంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, జూలై 6 (ఆంధ్ర జ్యోతి): నగర శివారు వామిదాలపాడు లోని గోదారంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో ఆషాడ మాసం తొలి ఏకాదశి సందర్భంగా, చాతుర్మాస దీక్షల్లో భాగంగా 63 రోజులపాటూ కొనసాగే సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ ప్రారంభమైంది. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త మాట్లాడుతూ సా మూహికంగా అందరూ కలిసి చేసే ప్రార్థన చాలా ప్రభావితమైందని, భక్తులు ఉచ్ఛరించే ప్రతి మంత్రం శబ్ధ తరంగాలు అనుకూల వాతావరణాన్ని కలిగిస్తాయని అన్నారు. వేకువ జామునే శ్రీగోదా రంగనాథ స్వామి వారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు, పూలతో అలంకరణ చేశారు. గోకులం మేనేజింగ్ ట్రస్టు పల్లెర్ల నాగరాజు, సభ్యులు బాలసుధాకర్, ఇటిక్యాల పుల్లయ్య, తల్లం సురేష్‌బాబు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారం అందజేశారు.

గొంతెండుతున్న ఆలూరు

● 15 రోజులుగా తాగునీరు లేదు ● ప్రణాళిక లేని అధికారులు, ప్రజా ప్రతినిధులు ● మరో రెండు ఎస్ఎస్ ట్యాంకులు నిర్మిస్తే శాశ్వతంగా పరిష్కారం


బాపురం రిజర్వాయర్‌లో అడుగంటిన నీరు

ఆలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గమైన ఆలూరు జనాభా 27వేల పైచిలుకే. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఇటు ప్రజా ప్రతినిధులకు గాని, అటు అధికారులకు గాని సరైన ప్రణాళిక లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తీవ్ర తాగునీటి ఎద్దడి ఉండటంతో ఇక్కడ ఉండేందుకు ఉద్యోగులు కూడా ఆసక్తి చూపడం లేదు. దూర ప్రాంతాలైన కర్నూలు, ఆదోని, గుంతకల్ నుంచి వచ్చి ఇక్కడ విధులు ముగించుకుని వెళుతున్నారు.

ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే..

పట్టణ జనాభా పెరుగుతున్నా వీరి అవసరాలకు తగిన విధంగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 8 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. దీంతో పాటు లక్ష లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక ఎస్ఎస్ ట్యాంకు ఉంది. 40 ఏళ్ల క్రితం అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన తాగునీటి పథకాలే ఇప్పటికీ శరణ్యం. ఆలూరుతోపాటు 22 గ్రామాలకు బాపురం రిజర్వాయర్ నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. అయితే 20 కి.మీ.ల దూరంలో ఉన్న బాపురం రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. దీనికితోడు నిత్యం సాంకేతిక కారణాలు, లీకేజీలు, మరమ్మతులు, పైపులైన్లు పగిలిపోవడంతో తాగునీరు అందడం లేదు. 15 రోజులుగా పట్టణ ప్రజలకు తాగునీరు అందడం లేదు. ప్రజలకు సమాధానం చెప్పలేక వాటర్‌మెన్లు మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు.

ఎల్ఎల్‌సీకి నీరు వస్తేనే

ఎల్ఎల్‌సీ కాలువలకు నీరు వస్తేనే తిరిగి సమస్య పరిష్కారమ్యే అవకాశం ఉంది. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ముందస్తుగా సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే బాపురం రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, ఆలూరు వద్ద మరో రెండు స్టోరేజ్ ట్యాంకులు ర్మిస్తేనే ససమ్య పరిష్కారం అవుతుందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్ ట్యాంకుతో పాటు ఆలూరు చెరువులో ఒక్కటి, అరికెర రోడ్డులో మరొకటి నిర్మించాలని ప్రజలు కోతున్నారు. ఎల్లెల్సీ నీటితో ఆలూరు, హుళేబీడు చెరువులను నింపాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళిక లేకపోవడమే కారణం



అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడమే తాగునీటి సమస్యకు కారణం. బాపురం రిజర్వాయర్ సామర్థ్యం పెంచి, మరో రెండు ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించాలి. నిరుపయోగంగా ఉన్న ఆలూరు చెరువును నింపితే సమస్య పరిష్కారమవుతుంది.

- దేవేంద్రప్ప, మాజీ జడ్పీటీసీ

పైపులైన్ల లీకేజీతో సమస్య



తరచూ పైపులైన్లు పగిలిపోవడం, లీకేజీలతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. బాపురం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో అక్కడ నుంచి నీటిని పంపింగ్ చేయడానికి సమయం పడుతుంది. ఎలాంటి సమస్యలు లేకుంటే వారానికోసారి నీరు సరరా చేస్తాం.

- ప్రభాకర్రావు, డిప్యూటీ ఎంపీడీవో, ఆలూరు

వెల్దుర్తిలో సినిమా షూటింగ్


షూటింగ్‌లో పాల్గొన్న నటీనటులు

వెల్దుర్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మగుండం, వెల్దుర్తి పరిసర ప్రాంతాల్లో ఆదివారం 'ఉంటే ఇలాగే ఉండాలి' సినిమా షూటింగ్ చేశారు. దర్శకుడు రోబో సుధాకర్ ఆధ్వర్యంలో నటులు అప్పారావు, సునీత, మనోహర్, సుందరం, స్వప్న, గడ్డం నవీన్, సత్తెన్న, సాగర్, రావణ్, జగదీశ్ పాల్గొన్నారు. వీరితో ఫొటోలు దిగడానికి ప్రజలు ఆసక్తి చూపారు. చిత్రంలో హీరోగా శివ, హీరోయిన్‌గా శిజల్ నటిస్తుండగా, మాటలు దివాన్‌వలి రాస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

రోడ్డుపై మురుగు తొలగించారు



మురుగును తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

తుగ్గలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులదొడ్డి గ్రామంలో రోడ్డుపై ఉన్న మురుగును పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ నెల 4వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'మురుగుతో అవస్థలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సర్పంచ్ విజయ్ స్పందించారు. ఆదివారం పారిశుధ్య కార్మికులతో రోడ్డు, కాలువను శుభ్రం చేయించారు. ప్రజలు చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయవద్దని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

చెరువులను నింపాలని మంత్రికి వినతి


మంత్రితో మనోహర్ చౌదరి

తుగ్గలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చెరువులను హంద్రీ నీవా నాటితో నీరు నింపాలని తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి కోరారు. శనివారం జలవనరుల మంత్రి నిమ్మల రామనాయుడును కలిశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చెరువులకు నీళ్ల నింపే కార్యక్రమం చేపట్టారని, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హంద్రీనీవా నీటితో చెరువులను నింపడానికి కృషి చేస్తున్నారని సహకరించాలని మంత్రిని కోరారు.

దళితులపై దాడులను అరికట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ దళిత నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులను అరికట్టాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను టీడీడీ నాయకులు కోరారు. ఆదివారం ఎమ్మిగనూరు పరిశీలకుడు లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ బాలాజీ పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో కలిశామన్నారు. ఇంకా కొన్నిచోట్ల కుల వివక్ష కొనసాగుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే ఆదోని పత్తికొండ నియోజకవర్గాల్లో పర్యటిస్తానని ఆయన చెప్పారన్నారు. వన్నూరప్ప, రాముడు, మల్లికార్జున, కొదండ రాముడు పాల్గొన్నారు.

శాకాహారం అలవర్చుకోవాలి

వెల్దుర్తి/వెల్దుర్తి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శాకాహారాన్ని అలవర్చుకోవాలని ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి వెంట్రాముడు అన్నారు. ఆదివారం కలుగొట్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఇందుమతి, పద్మ ఉన్నారు.

అత్యాచార నిందితుడిని శిక్షించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ ఏఐఎస్ఎఫ్ కోశాధికారి శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. మైనర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి అత్యాచారం చేసినందుకు బహిరంగంగా శిక్షించాలన్నారు. మల్లికార్జున, శివ పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు


శభాష్‌పురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

తుగ్గలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేదలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు అన్నారు. ఆదివారం శభాష్‌పురంలో 'తొలి అడుగు' నిర్వహించి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాల్లో సీసీ రోడ్లు వేశామని, బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం'అమలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో ఎమ్మెల్యే శ్యాంబాబు అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. తిరుపాల్ నాయుడు, వెంకటస్వామి, శ్రీనివాసులు గౌడు, మిద్దె వెంకటేశ్ యాదవ్, మోహన్, శ్రీరాములు, ఆదినారాయణ, సొసైటీ డైరెక్టర్ చిన్న పెద్దయ్య, సోమశేఖర్‌గౌడ్ ఉన్నారు.

చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ

● ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరుపాక్షి


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరుపాక్షి

హాలహర్వి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ అని ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరుపాక్షి ఆరోపించారు. ఆదివారం కామినహాల్ గ్రామంలో సర్పంచ్ పద్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. శశికళ, మారయ్య, రాష్ట్ర కార్యదర్శి కోనంకి జనార్దన్‌నాయుడు, దేవనకొండ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

పత్తికొండ టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఎం నాయకుడు రంగారెడ్డి అన్నారు. ఆదివారం సి.ఆర్.భవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈనెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దళితులను అడ్డుపెట్టుకోవద్దు

వెల్దుర్తి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయనాయకులు దళితులను అడ్డం పెట్టుకోవద్దని జనసేన కోఆర్డినేటర్ నాయకల్లు బాబ్జి అన్నారు. ఆదివారం మాట్లాడుతూ నాలుగు రోజులుగా కొందరు నాయకుల ప్రెస్‌మీట్లను గమనిస్తున్నామని, ఇది మంచిది కాదన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించుకోవాలే తప్ప ఇలా ఆరోపణలు చేయవద్దన్నారు. దళితులు ఓట్ల కోసమే కాదని, మనోభావాలు ఉంటాయన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త

మద్దికెర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని ఏఎస్ఐ ఫణిరాజ్ సూచించారు. ఆదివారం సాయంత్రం మెయిన్‌బజారులో ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలు చెప్పమని అడిగితే చెప్పకూడదన్నారు. ఓటీపీ నెంబర్లు బ్యాంకర్లు అడుగరని, వెబ్‌లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. విద్యాకమిటీ చైర్మన్ చంద్ర, వీరేష్, ఉన్నారు.

యూరియా కొరత లేదు


ఏవో సుధాకర్

ఆదోని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందొద్దని ఏవో సుధాకర్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ డీసీఎంఎస్ ద్వారా 15 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. అలాగే ప్రైవేట్ డీలర్ల వద్ద 620 మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందరూ మెచ్చేలా పాలన

మద్దికెర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న పాలన అందరూ మెచ్చేలా సాగుతోందని టీడీపీ నాయకుడు నెట్టికంటి నాగరాజు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు మూలింటి రాము యాదవ్, కార్యదర్శి గుడి ఎల్లప్ప అన్నారు. ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత వైసీపీ పాలనలో ప్రజలు పడిన ఇబ్బందులను వివరించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం


చిప్పగిరి: మొహర్రంలో పాల్గొన్న భక్తులు

చిప్పగిరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రంను భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి, సయ్యద్ షా వంశీయులు డాక్టర్ సయ్యద్ రజాక్ ఖాదిరి, సయ్యద్ హర్షద్ ఖాదిరి పాల్గొన్నారు. చిప్పగిరి దౌల్తాపురం గ్రామానికి చెందిన పీర్లను చూడడానికి భక్తులు రావడంతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది. ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు. సయ్యద్ అబ్దుల్ సత్తార్ హాది ఖాదిరి ఉరుసు సందర్భంగా గంధోత్సవం నిర్వహించారు.

పత్తికొండ టౌన్: తేరుబజార్, ఉప్పరోళ్ల కట్ట, వడ్డేకట్ట, కుమ్మరివీధి, గుండప్ప హోటల్ ప్రాంతాల్లో పీర్ల ను కొలువుదీయించి, పూజలు చేశారు.

ఆస్పరి: మొహర్రం ఆదివారం ముగిశాయి. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సాయంత్రం పీర్లను ఊరేగించారు. సీఐ మస్తాన్‌వలి బందోబస్తు నిర్వహించారు.

దేవనకొండ: మండలంలో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. పాలకుర్తి గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు దివాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ప్రార్థనలు చేసి మొక్కుబడులు చెల్లించారు.

విద్యా సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న ప్రతినిధులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫెయిత్ హోమ్ నిర్వాహకులకు నంద్యాల చైతన్య భారతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యా సామగ్రి అందజేశారు. ఫెయిత్ హోమ్ నిర్వాహకుడు బిషప్ డాక్టర్ డానియల్ ప్రేమ్‌కుమార్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. విజయభాస్కర్, వరలక్ష్మి, నేస్తం సభ్యురాలు మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డా. పార్థసారథి

ఆదోని టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో నిధులను దుర్వినియోగం చేసిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదివారం అమరావతి నగర్‌లో సామూహిక మరుగుదొడ్ల పనులు ప్రారంభించారు. సామూహిక మరుగుదొడ్లు లేవని మహిళలు తనకు వివరించడంతో నిధులు మంజూరు చేశామనారు. వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, చైర్‌పర్సన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు, ఎంఈ వెంకట చలపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, వెల్లాల మధుసూదన్ శర్మ, మొహమ్మద్ పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకు ఘన నివాళి

దేశం ఒక్కటిగా ఉండాలని ఉద్యమించిన నాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదివారం చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఆయన ఆశయాలను ప్రధాని మోదీ అమలు చేస్తున్నారన్నారు. విట్టారమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, నాగరాజు గౌడ్, నాగార్జున, రవి శంకర్, పగడాల కిరణ్ కుమార్, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కానిస్టేబుల్

పత్తికొండ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ శేఖర్ కుటుంబానికి 2018 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఆర్థికసాయం చేశారు. పత్తికొండ పట్టణానికి కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సహచర కానిస్టేబుళ్లు పోగుచేసిన రూ.1.50 లక్షలను మృతుడి భార్యకు అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

హక్కులను కాలరాస్తున్నారు

ఆదోని అగ్రికల్చర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ హక్కులను కాలరాస్తోందని ఎస్టీయూ కౌన్సిలర్ అకడమిక్ కమిటీ సభ్యుడు బి మహేదేవప్ప అన్నారు. ఆదివారం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడు తూ ఐచ్ఛిక సెలవుల పండుగ ఉపాధ్యాయు లకు ఒకటే కాదని విద్యార్థులకు కూడా ఉంటుం దని ప్రభుత్వ అధికారులు గుర్తు ఎరగాలన్నారు. పీఆర్సీ డీఏ బకాయిలు చెల్లించకుండా జాప్యం చేస్తుందని ఆక్షేపించారు. సుంకన్న, రామాంజినే యులు, సుధాకర బాబు, భాస్కర్, గణేష్, రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆదుకోవడం బాధ్యత

తుగ్గలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆపన్నులను ఆదుకోవడమ బాధ్యత అని టీడీపీ నాయకుడు రాజేంద్రగౌడ్, జయచంద్ర గౌడ్ అన్నారు. ఆదివారం చెన్నంపల్లిలో అనారోగ్యంతో మంచాన పడడ్డ శంకర్ కుటుంబానికి రూ.25వేలు అందజేశారు. స్వయం రక్షక సేవ గ్రూప్ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారికి చేదోడుగా ఉంటున్నామన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న గిడ్డయ్య

ఆస్పరి, జూలై 6(ఆధ్రజ్యోతి): ఈనెల 11వ తేదీన ఆలూరులో నిర్వహించనున్న సీపీఐ 12వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య, నాగేంద్రయ్య కోరారు. ఆదివారం కార్యాలయంలో మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతం కరువు కాటకాలతో అల్లాడిపోతోందన్నారు. లక్షలాది కుటుంబాలు వలసపోయి జీవిస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. రామాంజనేయ, ఉరుకుందప్ప, శివన్న పాల్గొన్నారు.

బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

ఆదోని టౌన్/ఆదోని రూరల్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారిని బెదిరించి, కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తించిన మహిళా నాయకురాలిపై చర్యలు తీసుకోవాలని మైనార్టీ హక్కుల పోరాట సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ తాను చెప్పిన వారికే రేషన్ బియ్యం అందించాలని ఫోన్‌లో బెదిరిండం విచారకరమన్నారు అధికారులకు దిశానిర్దేశం చేయాలే కానీ బెదిరింపులు పాల్పడకూడదన్నారు. ఎమ్మెల్యే స్పందిచాలని డిమాండ్ చేశారు. సలహాదారుడు నరేంద్ర యాదవ్ ఉన్నారు. అధికారిని మహిళా నాయకురాలు బెధిరించడం తగదని ఎరుకల సంఘం నాయకుడు మోపిరి సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. అధినాయతక్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కులమతాలకు అతీతంగా మొహర్రం



మంత్రాలయంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



గోనెగండ్లలో పూజలు అందుకుంటున్న పీర్లు



దొడ్డిమేకలలో నిమజ్జనానికి వెళుతున్న పీర్లు

మంత్రాలయం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం, మాధవరం, రాంపురం, వగరూరు, వి.తిమ్మాపురం, మాలపల్లి, రచ్చుమర్రి గ్రామాల్లో కులమతాలకు అతీతంగా మొహర్రం నిర్వహించారు. గత వారం రోజుల నుంచి కొలువుదీరిన పీర్ల దేవుళ్లు పూజలందుకుని ఆదివారం సాయంత్రం ఊరేగింపుతో డ్రమ్స్, మంగళవాయిద్యాలు తప్పెట్లుతో అగ్నిగుండం చుట్టూ అల్లాయ్ బల్లాయ్‌లు నిర్వహించి తుంగభద్ర నది వరకు పీర్లను ఊరేగింపు చేశారు. అనంతరం నదిలో నిమజ్జనం చేసి భక్తిశ్రద్ధలతో పీర్ల దేవుళ్లను పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోనెగండ్ల: త్యాగానికి ప్రతీకగా కులమతాలకు అతీతంగా, హిందూ ముస్లింలు మొహర్రంను ఆదివారం మండల కేంద్రమైన గోనె గండ్ల, ఐరన్‌బండ గ్రామాల్లో నిర్వహించుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు గాను విచిత్రవేషధారణలు వేశారు. గ్రామ ప్రజలంతా వీరి వేశధారణలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. సాయంత్రం పీర్ల చావిడిల దగ్గర పీర్లస్వాముల వారి సవారి నిర్వహించారు. భక్తులు అడిగిన భవిష్యత్తు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ ఎడాది వర్షాలు ఎలా కురుస్తాయి, పంటలు ఎలా పండుతాయని గ్రామప్రజలు పీర్ల స్వాములను అడిగారు. సాయంత్రం పొద్దుపోయాక పీర్లను గ్రామ శివార్ల దగ్గర ఉన్న పురాతన బావిదగ్గరకు తీసుకువెళ్లారు. రాత్రి అక్కడి నుంచి అర బ్బాషాలో శోకిస్తు పాటలను పాడుతు చావిడిల దగ్గరకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలం లోని గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు కరోనా నిబంధనలను పాటిస్తు గట్టిబందోబస్తు నిర్వహించినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరుతో పాటు, దోడ్డిమేకల, పీకలబెట్ట, మేకడోణ, గంగులపాడు గ్రామాల్లో మొహర్రం నిర్వహించారు. ఆదివారం ఉదయం పీర్లను వీధి, వీధినా ఊరేగింపు చేసి పీర్ల వద్ద భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు చేసిన నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. సాయంత్రం పీర్లను పురవీధుల గుండా మేళతాళలతో, డప్పుళ్ల నడుమ నిమజ్జనానికి తరలించారు. మొహర్రం వేడుకల్లో ఏలాంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా ఏస్ఐ నిరంజన్ రెడ్డి గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మిగనూరు రూరల్: మొహర్రంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఏనుగుబాల, దైవందిన్నె, పార్లపల్లి గ్రామాల్లో మొహర్రంపై ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం వేడుకలకు కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. పీర్లచావిడి ముందు ఎగిరే సమయంలో అల్లర్లకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించమన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని కామవరం, బదినేహాల్ గ్రామాలలో ఆదివారం మొహర్రంను ప్రజలు నిర్వహించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తును నిర్వహించారు. మండలంలోని మిగతా గ్రామాల్లో మొహర్రం సోమవారం జరగనుంది.

ఏడాది పాలనలోనే ప్రజాదరణ

● ఎమ్మెల్సీ బీటీ నాయుడు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

కోసిగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలోనే ప్రజాదరణ వచ్చిందని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. కోసిగి మండల పరిధిలోని ఎమ్మెల్సీ బీటీ నాయుడు స్వగ్రామమైన జుమాలదిన్నె గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు అందజేస్తున్న సం క్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు ఎంపీటీసీ హనుమంతు, రాగయ్య, తదితరులు ఉన్నారు.

నందవరం: ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే అది సియం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు గట్టాల రంగన్న, ఎంపీటీసీ గడంగం నరసింహులు, తిమ్మప్ప, గ్రామ అధ్యక్షుడు గోపాలు అన్నారు. అదివారం మండలంలోని జగ్గాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా టీడీపీ అందించిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దస్తగిరి, చిన్న ఈరన్న, ఉరుకుందు పాల్గొన్నరు.

పెద్దకడబూరు: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు మల్లకల్, మునెప్ప అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కంబదహల్ గ్రామంలో సుపరిపాలనలో తోలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు తిమ్మప్ప, మధు, జయరాముడు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



పూజలు అందుకుంటున్న చింతలాముని, నల్లారెడ్డి స్వాములవారు

గోనెగండ్ల, జూలై 6 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆదివారం తొలిఏకాదశి (ఆషాఢ శుద్ధ ఏకాదశి) వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే యువకులు, మహిళలు, పెద్ద ఎత్తున వైష్ణవ దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో బాగంగా చింతలాముని, నల్లారెడ్డి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ, మహా మంగళహారతి నిర్వహించారు. తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. అనంతరం సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని హెచ్ కైరవాడి, గాజుల దిన్నె, కులుమాల, అలువాల, పుట్టపాశం, వేముగోడు, గంజహల్లి, బైలుప్పల, అగ్రహారం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు తదితర గ్రామాల్లో కూడా భక్తి శ్రద్ధలతో తొలిఏకాదశి వేడుకల జరుపుకున్నారు.

దేశవ్యాప్త సమ్మెకు ఏఐకేఎస్ మద్దతు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రైతాంగ హక్కుల సాధనకై ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏపీ రైతు సంఘం(ఏఐకేఎస్) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సహాయ కార్యదర్శి కేసీ జబ్బార్‌లు తెలిపారు. ఈనెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు రంగన్న, భాస్కర్‌యాదవ్, మల్లికార్జున గౌడ్, వీరేష్, రవి, నరసింహులు, ఎల్లప్ప, కాశీం పాల్గొన్నారు.

నిత్యపూజలకు విరామం



అలంకరణలేని రాఘవేంద్ర స్వామి బృందావనం

మంత్రాలయం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి సన్నిధానంలో ఏకాదశి సందర్భంగా నిత్యపూజలకు విరామం కల్పించారు. ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని రాఘవరాయుల మూల బృంధావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, తులసి అర్చన చేశారు. టెంకాయ కొట్టడం పరిమళ ప్రసాదం, రథోత్సవాలు, బృంధావనానికి ప్రత్యేక అలంకరణ, నిత్యాన్నదానం బంద్ చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారి నిజ బృంధావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండితులు, మఠం అధికారులు, ఉద్యోగులు ఏకాదశి సందర్భంగా ఉపవాసాన్ని పాటించారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక సప్త ముద్రధారణ

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించే సామూహిక సప్తముద్రధారణకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఏడాదికి ఒకసారి జరిగే తొలి ఏకాదశిలో భాగంగా హోమాలు నిర్వహించి మూలరాములకు పూజలు చేసి తొలి ముద్రధారణ పీఠాధిపతి వేసుకున్నారు. కార్యక్రమంలో పండిత కేసరి రాజా ఎస్ గిరిరాజాచార్ ద్వార పాలక అనంతస్వామి, ప్రకాషాచార్, విజయేంద్రాచార్, పవనాచార్ తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతుంది. ఆదివారం సాయంత్రం మంత్రాలయం వద్ద 318.650 మీటర్ల నీటి మట్టంతో 68 వేల క్యూసెక్కులతో ఉధృతంగా ప్రవహిస్తోంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే పుణ్యస్నానాలు చేసే భక్తులకు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు..నది ఒడ్డున గజ ఈతగాళ్లు, పుట్టీలు, పోలీసులు, సెక్యూరిటీతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. నది తీర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు ఆదేశించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని శ్రామిక మహిళలకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పనకై జూలై 9న చేపట్టే ఆశా వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ లక్ష్మీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంజుల, లక్ష్మీ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనీఫ్, ప్రసాద్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఎర్రన్న కోరారు. ఆదివారం పట్టణంలోని ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబందనలు తప్పకుండా పాటించాలని, ఎస్సై ఎర్రన్న తెలిపారు.

వీల్ చైర్ విరాళం

కౌతాళం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి ఆదివారం ఓ భక్తుడు వీల్‌చైర్‌ను విరాళంగా అందజేసినట్లు ఆలయ సీనియర్ అసిస్టెంట్ కిరణ్ తెలిపారు. వీల్ చైర్‌ను కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణానికి చెందిన స్వామి వారి భక్తుడు యల్లప్ప రావు వీల్ చైర్‌ను విరాళంగా దేవాలయపు కార్యాలయం నందు అందజేసినట్లు తెలిపారు.

కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

గోనెగండ్ల, జూలై 6(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల ట్రాక్టర్ యూనియన్ కమిటీ సభ్యుల ఎన్నిక ఆదివారం ఎకగ్రీవం జరిగింది. కమిటీ ప్రెసిడెంట్‌గా గొల్లశివన్న, వైస్ ప్రెసిడెంట్ గా అమాలి వెంకటేష్, కార్యదర్శి గా రహంతుల్లా, సహాయకార్యదర్శి గా గోవిందు, కోశాధికారిగా మస్తాన్ ఎనికయ్యారు. వారు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

కుట్రదారులు టీడీపీకి అవసరం లేదు



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వైసీపీతో జతకట్టిన కుట్రదారులు మాజీ కౌన్సిలర్ మధుబాబు, మల్లికార్జునలు టీడీపీకి అవసరం లేదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, నాయకులు కలిముల్లా, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, యుకే వీరేంద్ర, నవాజ్, అంబేద్కర్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుబాబు, మల్లికార్జునల రాజీనామాలపై మాట్లాడుతూ పార్టీకి రాజీనామా చేసిన వ్యక్తులను 2014లో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి కౌన్సిలర్లుగా చేశారన్నారు. అలాగే 2021లో కూడా రెండోసారి అవకాశం ఇచ్చారని, వారిపై అభిమానం, గౌరవం లేకనే ఇచ్చారా.. అని ప్రశ్నించారు. పార్టీకి రాజీనామా చేసిన వారు సమాధానం చెప్పాలన్నారు. ప్రజాసేవ చేసే వ్యక్తులను పార్టీలోకి తీసుకుంటామన్నారు. వైసీపీ పాలనను ఓడించేందుకు రాష్ట్రంలోని ప్రతికార్యకర్త అహర్నిషలు కష్టపడ్డారన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ నాయకులు ప్రచారం చేస్తుంటే రాజీనామ చేసిన మధుబాబు, మల్లికార్జునలు తమ ఫోన్లు ఎందుకు స్విచ్ ఆఫ్‌చేసుకున్నారో చెప్పాలన్నారు. 2022 నాటి నుంచి పార్టీలో గ్రూపురాజకీయాలు చేస్తు మంచి వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేసింది మీరు కాదా అని అన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి గురించి మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. టీడీపీ ఓ ఫ్యాక్టరీ లాంటిదని పదిమంది పోతారు.. వందమంది వస్తారన్నారు. పార్టీలో కుట్రలు చేసే వ్యక్తులు ఏపార్టీలో ఉండలేరన్నారు. మాజీ కౌన్సిలర్ మధుబాబు చేసిన మోసాలను, చేసిన వ్యవహారాలను బయటపెడతామన్నారు. బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. సమావేశంలో నాయకులు కామార్తి మహేష్, నంబూరి సురేష్ చౌదరి, మల్లి, రాజేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి

● ఆయన సేవలు మరువలేనివి
● నివాళి అర్పించిన నాయకులు



ఎమ్మిగనూరులో నివాళి అర్పిస్తున్న బుట్టా రేణుక



ఎమ్మిగనూరులో వర్ధంతిని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణ వైసీపీ కార్యాలయంలో ఎమ్మిగనూరు ఇంచార్జ్ బుట్టా రేణుక బాబు జగ్జీవన్‌వన్ రామ్ వర్థంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌వన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మణియమని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాగేషప్ప, పట్టణ ఉపాధ్యక్షులు కొటకొండ నరసింహులు, విరుపాక్షి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం, నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డా.బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, అనిల్ కుమార్, యోహాన్, మారెన్న, నాగేంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: బాబూ జగ్జీవన్‌వన్ రామ్ యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ కాశీంవలి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో బాబూజగ్జీవన్‌రామ్ 38వ వర్థంతిని నిర్వహించారు. కార్యక్రమంలో షబ్బీర్, ఆసిఫ్, ఉరుకుందు, రఫిక్, లోకేష్, షాకిర్‌లు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరం తహసీల్దారు కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని డిప్యూటీ తహసీల్దారు శశిశేఖర్‌రావు ఆద్వర్యంలో అదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దళితుల, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితం అంకితం చేశాడన్నారు. కార్యక్రమంలో అపరేటర్ మోహ్దీన్, విఆర్వోలు, విఏఏలు పాల్గొన్నారు.

కోసిగి: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి వేడుకలు ఆదివారం కోసిగి మండల పరిధిలోని వందగల్లులో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వందగల్లు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: దళితుల ఆశాజ్యోతి మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని టీడీపీ నాయకులు టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, నాయకులు సుందరరాజు, కలిముల్లా, షాలేమ్, అంబేడ్కర్, కటారి రాజేంద్రలు అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ వర్థంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిఅర్పించారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి గౌడ్, దామా నరసింహులు, యుకే వీరేంద్ర, రామకృష్ణ, వాల్మీకి రాజు,అబ్దుల్లా, నరసప్ప, కామార్తి మహేష్‌లు8 పాల్గొన్నారు.

ఎస్సీకాలనీలో: పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం స్వాతంత్ర సమరయోదుడు, మాజీ ఉపప్రదాని బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్దంతిని టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న ఆద్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉసేని, సాల్మన్, ప్రసాద్, మోహన్, జైపాల్, ఏసన్న,కదిరికోట ఏసేపులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో: పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం ఆద్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ వర్దంతిని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆంథోని, తిమ్మన్న, సుమాల రాజు, గుంటప్ప, రాముడు, రంగన్న, భాస్కర్, పుల్లల బాబు, దేవదాసులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియాపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మహ్మద్‌ఖాద్రీ, వ్యవసాయ అధికారి శివశంకర్‌లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ రైతులు యూరియా కొరత ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులందరికి పుష్కలంగా యూరియాను అందజేయడం జరుగుతుందని, ఎమ్మిగనూరు సొసైటీకి 1160 బస్తాల యూరియా వచ్చిందన్నారు. అలాగే డీలర్స్ దగ్గర కూడా యూరియా ఉందన్నారు. డీలర్లు యూరియాను ఎలాంటి నిబందనలు లేకుండా ఎమ్మార్పీ ధరలకే అందజేస్తారన్నారు. ఎవరైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి'

ఎమ్మిగనూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని రైతులు, ప్రజలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేధికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజా సమస్యల పరిష్కార వేధికలో ఫిర్యాదు చేస్తే నిర్ణీత గడువులోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పేదల సంక్షేమానికి అంకితమైన ప్రధాని నరేంద్రమోదీ పాలన

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి అంకితమై ప్రధానమంత్రి నరేంద్రమోడి పాలన సాగిస్తున్నారని బీజేపీ నాయకులు తొగట నరసింహులు, మున్సిపల్ కౌన్సిలర్ దయాసాగర్, నాయకులు లలిత్, అడ్వకేట్ ఉరుకుందు, జగ్గాపురం చిన్న ఈరన్న, బీఎల్ నారాయణలు అన్నారు. దేశప్రధాని నరేంద్రమోడి 11ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో బీజేపీ నాయకులు పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ 11ఏళ్లలో కేంద్రప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేపట్టిన అభివృద్ధి పనులు, పేదలకు, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు, యువకలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శివ, పద్మావతి, వెంకటేశ్వర్లు, రవిలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

